క్లుప్తంగా

నేటి నుంచి మహిళలకు ఆటల పోటీలు

మురళీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో వివిధ అంశాల్లో మహిళలకు పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో మహిళలకు వంటలు, నడక, క్విజ్, మ్యూజికల్ చైర్ వంటి ఆటల పోటీలు జరుపుతామన్నారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మిల్లెట్ మహారాణి అనే అంశంలో వంటల పోటీలు సోమవారం సాయంత్రం 4 గంటలకు మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొనే వారు 94902 22662, 97012 47506 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవచ్చు.

చిన్నూరు మసీదు కమిటీ అధ్యక్షుడిగా నవాబు


షేక్ నవాబు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులోని చిన్నూరు మసీదు కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. కమిటీ అధ్యక్షుడిగా షేక్ నవాబు, ఉపాధ్యక్షుడిగా షేక్ హుస్సేన్, కార్యదర్శిగా షేక్ హుస్సేన్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా ఖాజా, కోశాధికారిగా మిసికీన్ బాబా ఎన్నికయ్యారు. మూడేళ్ల పాటు ఈ కమిటీ కొనసాగుతుందని నవాబు తెలిపారు.

గృహిణి అదృశ్యం

మద్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి కంచరపాలెంలో ఒక గృహిణి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న ముదపాక మౌనిక శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. భర్త ముదపాక సంతోష్ బంధువుల సహాయంతో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిద్దరికీ వివాహమై ఎనిమిదేళ్లయింది. ఆరేళ్ల కుమార్తె ఉంది. శనివారం ఉదయం భర్త నిద్ర లేచి చూసేసరికి భార్య మౌనిక కనపడలేదు. ఫోన్ కూడా ఇంట్లోనే వదిలేసి వెళ్లింది. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆమె కోసం వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో భర్త సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పైడిమాంబ నవరాత్రి మహోత్సవాలు


పైడిమాంబ

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి మార్చి 7 వరకు జరగనున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చాటింపు కార్యక్రమం నిర్వహించారు. 27న అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పూజలు చేస్తామని కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్ తెలిపారు. మార్చి 2న ఆలయ తృతీయ వార్షికోత్సవం నిర్వహించనున్నామన్నారు. మార్చి 7న అమ్మవారి జాతర జరుగుతుందన్నారు. ముగింపు ఉత్సవాల్లో తప్పెటగుళ్లు, బాణసంచా, గరిడి, పులివేషాలు, తీన్‌మార్, ఒడిశా దూమ్‌దడక్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సుందరీకరణ పనుల పరిశీలన

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్‌లో ఆదివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. ఇక్కడి కొత్త పార్క్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో పారిశుధ్యం, గ్రీన్ బెల్ట్‌లో ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. మద్రిపాలెం వుడా లేఅవుట్ కొత్త పార్కులో జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వాకింగ్ ట్రాక్‌లో బుద్ధుడి విగ్రహం వద్ద మహిళలకు ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు.

వినూత్నం.. విభిన్నం

- విద్యార్థులకు మేలు చేసేలా 'సెల్ఫ్'
- తీర్చిదిద్దిన నంగినారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు

సబ్బవరం: విద్యార్థులను స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే విధంగా సబ్బవరం మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సెల్ఫ్ అనే వినూత్న ప్రోగ్రాంను ఆవిష్కరించారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు తమకు అర్థంకాని అంశాలతో పాటు సందేహాలను ఆన్‌లైన్‌లోనే నివృత్తి చేసుకునేవిధంగా ప్రోగ్రాం రూపొందించారు.

ఎక్కడైనా.. ఎప్పుడైనా..

ఇది ఆన్‌లైన్ సాధనం కావడంతో స్మార్ట్ ఫోన్‌లో విద్యార్థులు ఎక్కడైనా,ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు సరళమైన పద్ధతిలో అన్ని సబ్జెక్టులు అర్థం చేసుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకునే విధంగా దీన్ని సిద్ధం చేశారు. విద్యార్థులు తమ అభ్యసనలో భాగంగా వరుసగా అడిగే ప్రశ్నలకు ముందుగా జవాబులు చెప్పిన తర్వాతే ఇతర ప్రశ్నలు వచ్చే విధంగా రూపొందించారు. ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే దానికి సంబంధించిన సమాధానం వివరించే వీడియో వచ్చేలా ప్రోగ్రాం డిజైన్ చేశారు. వరుసగా అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాతే ముందుకు వెళ్లడం జరుగుతుంది. దీంతో విద్యార్థులు క్లిష్టమైన అంశాలను నేర్చుకోవడంతో పాటు మరింత విస్తృతంగా సంబంధిత అంశాలను తెలుసుకోవచ్చు.



ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి(ఫైల్)

సాఫ్ట్‌వేర్ లేకుండానే ..

ఈ టూల్‌ను వినియోగించుకోవడానికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. కేవలం పీడీఎఫ్ ఫైల్ ద్వారా వినియోగించుకునే విధంగా రూపొందించారు. ఈ సెల్ఫ్ ప్రోగ్రాంలో భాగంగా సబ్జెక్టుల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాన్ని పాఠశాల,మండల,జిల్లా స్థాయిల్లో పర్యవేక్షించేందుకు అవసరమైన డ్యాష్ బోర్డును కూడా రూపొందించారు.

ప్రయోజనం ఇలా..

విద్యార్థి సబ్జెక్టును అర్థం చేసుకోవడంలో సమస్య ఉంటే వీడియోను పదేపదే వీక్షించవచ్చు. అతను ఎప్పుడైనా,ఎక్కడైనా అంశాలను చూసుకోవచ్చు. ఇది స్వీయ మూల్యాంకనం, స్వీయ అభ్యసన సామర్థ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ వీడియోలు గూగుల్ ఫామ్‌లో పొందుపర్చడంతో విద్యార్థులు కంటెంట్ వీడియో నుంచి పక్కకు మరళలేరు. ఈ టూల్‌ను క్లిక్‌బుల్ పీడీఎఫ్ ద్వారా వినియోగించుకోవచ్చు. గూగుల్ ఫారంలో 10 ప్రశ్నలు ఎంసీక్యూ రూపంలో ఇచ్చారు. తద్వారా విద్యార్థులు సరైన సమాధానం ఎంచుకుంటే తదుపరి ప్రశ్నకు వెళ్తుంది. విద్యార్థి తప్పు సమాధానం ఎంచుకుంటే అది వివరణ వీడియోకి తీసుకువెళ్తుంది. పూర్తి వీడియో చూసిన తర్వాత విద్యార్థి సరైన సమాధానం ఎంచుకోవడానికి అదే ప్రశ్నకు మళ్లించబడతారు. దీంతో విద్యార్థులు క్లిష్టమైన భావనలను నేర్చుకోగలుగుతారు.



ఉపాధ్యాయుల సబ్జెక్టుల వారీగా సిద్ధం చేసిన సెల్ఫ్ ఆన్‌లైన్ సాధనం

ప్రోగ్రాం లక్ష్యం..

- స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు విద్యార్థులను ప్రోత్సహించడం.
- విద్యార్థులకు క్లిష్టమైన అంశాల్లో సందేహాలను నివృత్తి చేయడం.
- తక్షణ సందేహ నివృత్తి కలిగించడం.
- విద్యార్థుల నిరంతర మూల్యాంకనం.
- పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడం.

ముగిసిన మెగా జాబ్ ఫెయిర్


ప్రిలిమినరీ రౌండ్‌కు హాజరైన విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీలో నాస్‌కామ్, బుల్లయ్య కళాశాల సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్ ఆదివారంతో ముగిసింది. రెండో రోజు కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. 55 ఐటీ, ఐటీఐ, బీపీవో, నాన్ ఐటీ కంపెనీలు నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 300 కళాశాలల నుంచి సుమారు 13 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్టు బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి తెలిపారు. ప్రిలిమినరీ రౌండ్‌లో ప్రతిభ చూపిన 4,250 మంది విద్యార్థులు ఫైనల్ రౌండ్‌కు ఎంపికైనట్టు చెప్పారు.ఈ రౌండ్‌లో ప్రతిభ చూపిన వారికి ఉగ్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యకరం


మాట్లాడుతున్న మిల్లెట్స్ క్యాంపైనర్ రాంబాబు

సీతంపేట: చిరుధాన్యాలు ఆరోగ్యకరమని మిల్లెట్స్ క్యాంపైనర్ రాంబాబు అన్నారు. గురుద్వారా సమీపంలోని ఒక హోటల్‌లో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని ఎలా తయారు చేయాలో అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలను నానబెట్టి వండుకోవాలని సూచించారు. వాటిని వండినపుడు వచ్చే గంజి తర్వాత రోజు తీసుకోవడం చాలా ఆరోగ్యకరమైనదని వివరించారు. అల్లం, వెల్లుల్లి, మజ్జిగ మంచి బాక్టీరియాను పెంచుతాయన్నారు. చిరుధాన్యాలను నానబెట్టి ఎండలో నేత వస్త్రంపై ఆరబెట్టి వాటిని పిండి చేసుకోవడం మంచిదన్నారు. బాగా పాలిష్ చేసిన ఆహార ధాన్యాలు ఆరోగ్యానికి మంచివి కాదన్నారు. సముద్ర ఉత్పత్తుల్లో ఎక్కువగా విషతుల్య రసాయనాలు ఉంటున్నాయని తెలిపారు. చద్దన్నం తినడం మంచి అలవాటని, రాగులతో చేసిన హల్వా వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. తెల్లవారిన ఎండ మంచిదని, గానుగ నూనె శరీరానికి రాసుకుని కాసేపు ఎండలో ఉండి స్నానం చేయడం ఆరోగ్యకరమని వివరించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధులు దాట్ల వర్మ, అశోక్, ఎం.యుగంధర్‌రెడ్డి, జె.వి.రత్నం, రుషి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను రక్షించుకుందాం


దీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి, నాయకులు

సీతమ్మధార: ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం కాకుండా రక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరాహార దీక్షలు 675వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతో ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి లభించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు కూడా ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమవంతు పాత్రను పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం కూడా అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు శివాజీ, ఏపీ పరిరక్షణ జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి జగన్ మురారి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం


49వ వార్డులో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మద్రిపాలెం: కార్పొరేటర్ మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆదివారం 49వ వార్డు 279 సచివాలయం సెక్టార్–3 మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు పర్యటించారు. ఆయన దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకెళ్లారు. ప్రశాంతినగర్ పార్క్ సమీపంలో పలువురు అపార్ట్‌మెంట్లు నిర్మించి వ్యర్థాలను రోడ్లపై, కాలువల్లో వేయడం వల్ల పారిశుధ్య సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. మురళీనగర్ సెక్టార్–3 సమీపంలో 60 ఫీట్ రోడ్డు నిర్మాణం సుదీర్ఘ కాలం నుంచి జరగలేదన్నారు. దీంతో గృహనిర్మాణాలు చేపట్టి ఆ రోడ్డుపై డెబ్రిస్ పడేయడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని వివరించారు. కొందరు భూ ఆక్రమణదారులు తప్పుడు పత్రాలతో నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాని ఇచ్చారు. సెక్టార్–3లోని పలు ప్రాంతాల్లో బీటీ రోడ్లు, కాలువలు పాడైనందున పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలియజేశారు. సుదర్శన్ పార్క్‌లో వాకర్స్ సౌకర్యార్థం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. వీటన్నింటిపై కార్పొరేటర్ శంకరరావు స్పందించి ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్క్ అభివృద్ధిలో బాగంగా ఓపెన్ జిమ్, పిల్లలకు ఆట పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం స్థానికులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో భట్రాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రవికుమార్, విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయినింటి రవికుమార్, కె.ఢిల్లీరావు, బి.శివరామప్రసాద్, కె.మున్నా, బి.శంకర్, జి.వెంకటరావు, కె.కిషోర్, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయం పేరుతో భూ ఆక్రమణ

సీతమ్మధార: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయం పేరుతో హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ ఏఎస్ఎన్ రాజు భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని శ్రీనివాసరావు కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆక్రమిత స్థలం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992లో కో–ఆపరేటివ్ సొసైటీ పేరిట తమకు స్థలం ఇచ్చారని గుర్తుచేశారు. ఇటీవల దేవాలయ నిర్మాణం కోసం హనుమాన్ ట్రస్ట్ సభ్యులు దేవదాయ శాఖ నుంచి 300 గజాలకు అనుమతి తీసుకున్నారన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో మరో 400 గజాలు అదనంగా తీసుకుని పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి చేశారన్నారు. మొత్తం 700 గజాలే కాకుండా సుమారు 2000 గజాల వరకు తమ ప్లాట్‌లో నుంచి స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా పశ్చిమ దిశగా ఉన్న తమ స్థలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమిస్తున్నారన్నారు. దీనిపై అనుమతుల కోసం దేవదాయ శాఖ జీవీఎంసీ అధికారులను సంప్రదించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి ఇక్కడ జరుగుతున్న భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. వర్మ, ప్రకాష్‌రావు, వెంకటనరసింహరాజు, ఎం.ఎం.రావు, ఎం.హెచ్.జి.రావు, గాంధీరాజు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐలు శ్రీనివాసరావు, సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. గతాన్ని వీడి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దిగజారుడు చర్యలు

సీతమ్మధార: ఓటమి భయంతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగజారుడు చర్యలు చేపడుతోందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. సీతమ్మధార ఎల్ఐసీ క్వార్టర్స్‌లోని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. దాదాపు అన్ని తరగతుల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు హుందాగా వ్యవహరించాలని, ఒక రాజకీయ పార్టీ ఏజెంట్‌లా ఉండొద్దని సూచించారు. చట్టసభల్లో సమర్థవంతంగా గళం వినిపించగలిగే డాక్టర్ కోరెడ్ల రమాప్రభను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని అజశర్మ విజ్ఞప్తి చేశారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


14వ వార్డులో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌తో కలిసి ప్రచారం చేస్తున్న కె.కె.రాజు


44వ వార్డులో పట్టభద్రురాలికి కరపత్రం అందిస్తున్న ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కె.కె.రాజు పిలుపు

సీతమ్మధార: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం 14వ వార్డు పోర్టు స్టేడియం, రాకెట్ పార్కు తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌తో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రచారం చేశారు. వాకర్స్‌ను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటు మూరి సతీష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలీ, కార్పొరేటర్ పి.ఉషశ్రీ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

44వ వార్డులో..

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు ఇంటింటా ప్రచారం చేపట్టారు. వార్డులోని రామచంద్రానగర్‌లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేసి సీతంరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హైమా, రాజు, సీతారామ్, ఎం.గోపి, కన్నప్పడు, పి.గోపి, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డు పార్కుల్లో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వార్డు నాయకులతో కలిసి పట్టభద్రులకు కరపత్రాలను అందజేస్తూ ఎన్నికల ప్రచా రం సాగించారు. మాధవధారలోని ఈస్ట్ పార్క్, సెంట్రల్ పార్క్, సింహాద్రి పార్క్, సిద్ధార్థ పార్క్, ఎంఎస్ఆర్ పార్క్, వెస్ట్ పార్క్‌లో సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వాకర్స్‌ను కార్పొరేటర్ కోరారు. పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ దిడ్డి రమేష్, మెట్ట దమయంతి, శ్యామ్, వై.వరలక్ష్మి, ధర్మవతి, గణేష్, ధర్మేంద్ర, ఎద్దు పైడిరాజు, సాధు పాల్గొన్నారు.

మురళీనగర్ సెక్టార్–3లో..

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు మురళీనగర్ సెక్టార్–3లో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, మురళీనగర్ పార్కులో వాకర్స్, పట్టభద్ర ఓటర్లను కలిసి ప్రచార కరపత్రాలు అందించారు. భట్రాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నిడిమోళి రవికుమార్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ అయినింటి రవికుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య సేవలు

వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని రావిచెట్టు అమ్మవారి ఆలయం వద్ద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికుల కు వైద్య సిబ్బంది బీపీ, సుగర్ వంటి వైద్య పరీక్షలు చేశారు. శరీర బరువు తగ్గించుకునేందుకు ప్రతి రోజు డైట్ ప్లాన్, న్యూట్రిషన్, బ్యాలెన్స్ కేలరీస్‌పై వైద్యులు సలహాలు, సూచనలిచ్చా రు. కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ దుంగి దిలీప్‌కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకుందాం


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మురళీనగర్: మురళీనగర్ గౌరీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మురళీనగర్ సంఘం కార్యా లయంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆది వారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. శంకర్ ఫౌండేషన్ క్యాంప్ డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణకుమార్ పర్యవేక్షణలో పది మంది సిబ్బంది స్థాని కులకు వైద్య పరీక్షలు జరిపారు. కళ్లను జాగ్రత్త గా కాపాడుకునేందుకు పలు సూచనలిచ్చారు. శిబిరంలో పాల్గొన్న వారికి మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు పి.వెంకటరావు, కార్యదర్శి బి.రత్నం, కోశాధికారి పి.కుమార్‌రాజా శిబిరం నిర్వహణకు సహకరించారు.

లలితా పీఠంలో..


సూచనలిస్తున్న డాక్టర్ సత్యనారాయణరెడ్డి

సీతంపేట: స్వస్తిక్ ఆర్థోపెడిక్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో ఉచిత ఎముకలు, కీళ్ల వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పి.వి.వి.సత్యనారాయణరెడ్డి వైద్య పరీక్షలు చేశారు. కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, ఎముకల నొప్పితో బాధపడుతున్న పలువురు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. వీరికి బోన్ డెన్సిటీ పరీక్ష చేసి అవసరమైన మందులు వాడాలని డాక్టర్ సూచించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

120 మందికి వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెహరా హాస్పిట ల్స్ వారి సౌజన్యంతో ఆదివా రం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ బెహరా విజయరవితేజ, డాక్టర్ నరేంద్రల పర్యవేక్షణలో 120 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లను సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి లంకా వెంకట సుధాకర్, పూర్వ అధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, ఎ.గంగయ్యాచారి, కోశాధికారి ఒ.కూర్మారావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు, బి.సూర్యనారాయణ, ఎం.నారాయణరావు, టి.వి.రమణ, పి.కుమార్‌రాజా వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

దుర్గాలమ్మకు 108 రకాల పిండివంటల నివేదన


అమ్మవారికి నివేదించిన 108 రకాల వంటకాలు

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి అష్టోత్తర శత పదార్థ నివేదన(108 రకాల వంటకాలతో నివేదన) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాటిని ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనను కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించారు. ఐదు వేల మందికి అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు 108 రకాల పిండి వంటలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, ఆలయ ఈవో కీర్తి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు పాల్గొన్నారు.